

మెగా జాబ్‌మేళా 8లో

మాకవరపాలెంలో నిర్వహించిన మెగా జాబ్ మేళాకు 824 మంది హాజరయ్యారు. వివిధ కంపెనీలకు 93 మంది ఎంపికయ్యారు.



విమ్స్‌కు కొత్త వైద్యులు

ఆరిలోవ: విమ్స్‌కు 27 మంది కొత్త వైద్యులు రానున్నారు. వీరిలో సూపర్ స్పెషాలిటీ, జనరల్ వైద్యులున్నారని విమ్స్ డైరెక్టర్ తెలిపారు.

మోస్తరు వర్షసూచన

అనకాపల్లిటౌన్: రాగల ఐదు రోజులు ఓ మోస్తరు వర్షసూచన ఉందని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం వాతావరణ శాస్త్రవేత్త ఎంబీజీఎస్ కుమారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 23న 8, 24న 8, 25న 7, 26న 7, 27న 18 మి.మీ. వర్షపాతం, 33 నుంచి 33.4 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయన్నారు.

'జగనన్నకు చెబుదాం'..
అనకాపల్లి నంబర్ వన్



అర్జీలు సమర్పించేందుకు బారులు దీరిన ప్రజలు



హాజరైన అధికారులు

- అర్జీల సంఖ్య.. పరిష్కారంలో ఉత్తమ పనితీరు
- మండల కేంద్రాల్లో 'స్పందన'కు విశేష ఆదరణ
- ఇప్పటి వరకు నాలుగు చోట్ల 795 వినతుల స్వీకరణ



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, జాయింట్ కలెక్టర్ జాహ్నవి

సాక్షి, అనకాపల్లి: సమస్యల పరిష్కారమే ధ్యేయంగా నిర్వహించే 'స్పందన' కార్యక్రమం ప్రజలకు మరింత చేరువైంది. కొత్తగా మండల స్థాయిలో వారానికి రెండు చోట్ల నిర్వహిస్తున్న 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమానికి మంచి స్పందన లభిస్తోంది. జిల్లా అధికారులు మండలాలకు వెళ్లి వినతులు స్వీకరిస్తే మరింత మంచి జరుగుతుందన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచన అనకాపల్లి జిల్లాలో చక్కని ఫలితాలను ఇస్తోంది. అత్యధిక వినతుల స్వీకరణలో, పరిష్కారంలో అనకాపల్లి రాష్ట్రంలోని 26 జిల్లాల్లో నంబర్ వన్‌గా నిలిచింది. ఇప్పటివరకు నాలుగు మండలాల్లో నిర్వహించిన జేకేసీ స్పందనకు 795 వినతులు వచ్చాయి. వీటి పరిష్కారం తీరును జాయింట్ కలెక్టర్ జాహ్నవి అధ్యక్షతన ముగ్గురు జిల్లా అధికారుల కమిటీ ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తోంది. అర్జీల్లో 40 శాతం రెవెన్యూ సంబంధిత సమస్యలు కాగా... మిగిలిన సమస్యల్లో 90 శాతానికి పైగా పరిష్కరించారు.

ప్రజలకు మరింత చేరువగా..

ప్రజా విజ్ఞప్తుల స్వీకరణ కార్యక్రమంలో ప్రభుత్వం ఎప్పటికప్పుడు మార్పులు చేస్తోంది. ప్రజలకు మరింతగా అందుబాటులోకి తీసుకువచ్చేలా సంస్కరణలు చేపడుతోంది. ప్రతి సోమవారం కలెక్టరేట్‌తోపాటు, ఆర్డీవో, తహసీల్దార్, ఎంపీడీవో స్థాయిలో వినతులు స్వీకరిస్తున్న విషయం తెలిసిందే. గ్రామ సచివాలయంలో కూడా ఫిర్యాదులు స్వీకరిస్తారు. స్పందన కార్యక్రమానికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అత్యంత ప్రాధాన్యమిస్తారు. అర్జీల పరిష్కారంపై ఎప్పటికప్పుడు సమీక్షిస్తారు. 'జగనన్నకు చెబుదాం' పేరుతో నేరుగా ఆన్‌లైన్‌లో ఫిర్యాదు నమోదు చేసే ప్రక్రియను కూడా ప్రారంభించారు. ఫిర్యాదు నేరుగా సీఎం కార్యాలయానికి చేరేలా ఏర్పాటు చేశారు. ఇప్పుడు ప్రతి బుధ, శుక్రవారాల్లో మండల స్థాయి జగనన్నకు చెబుదాం (జేకేసీ) కార్యక్రమం నిర్వహిస్తున్నారు. జిల్లా అధికారులందరూ మండల కేంద్రానికి వెళ్లి అర్జీలు స్వీకరిస్తున్నారు.

వెంటనే ఫీల్డ్ విజిట్

జగనన్నకు చెబుదాం (స్పందన) కార్యక్రమంలో వచ్చిన అభ్యర్థనలు, సమస్యలన్నింటినీ వెంటనే పరిష్కరించాలి. పరిష్కారం కాని ప్రతి అర్జీకి స్పష్టమైన వివరణ ఇవ్వాలి. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లాలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం (స్పందన) కార్యక్రమానికి ఆదరణ బాగుంది. ఎక్కువగా సివిల్ తరహా సమస్యలు వస్తున్నాయి. మండల స్థాయి జేకేసీ స్పందన ముగిసిన అనంతరం ఫీల్డ్ విజిట్‌కు జిల్లా అధికారులను పంపిస్తున్నాం. ఈరోజు గొలుగొండలో స్పందన అయ్యాక జిల్లా అధికారులంతా ఫీల్డ్ విజిట్ చేశారు.

– రవి పట్టాన్‌శెట్టి, జిల్లా కలెక్టర్

ఇదీ స్పందన..

మండల స్థాయి జేకేసీ స్పందన కార్యక్రమానికి ఈనెల 8వ తేదీన శ్రీకారం చుట్టారు. ఇంత వరకు నాలుగు చోట్ల నిర్వహించగా.. అందిన వినతుల వివరాలు ఇలా ఉన్నాయి.

తేదీ	మండలం	అర్జీల సంఖ్య
8	నాతవరం	178
15	కోటవురట్ల	159
20	రావికమతం	282
22	గొలుగొండ	186

గొలుగొండలో జేకేసీలో 186 వినతులు

గొలుగొండలో శుక్రవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 186 వినతులు వచ్చాయి. ఎక్కువగా భూతగాదాలు పరిష్కరించాలని, ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని, సాగు, తాగునీటి సౌకర్యం కల్పించాలని, దగ్గరలో వైద్య, పశు వైద్య సదుపాయాలు కావాలని విన్నవించుకున్నారు. స్థానిక రెవెన్యూ అధికారులు అర్జీదారులకు అన్ని సౌకర్యాలు కల్పించారు. నీడనిచ్చేందుకు షామియానా, కూర్చునేందుకు కుర్చీలు, తాగునీరు ఏర్పాటు చేశారు. కలెక్టర్‌తోపాటు జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి, నర్సీపట్నం అడిషనల్ ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా, నర్సీపట్నం ఆర్డీవో జయరాం, గ్రామ వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి మంజులవాణి, తహసీల్దార్ ఆనందరావు అర్జీలను స్వీకరించారు.

డ్రైనేజీ లేక ఇబ్బందులు



మా గ్రామంలో ఆర్అండ్‌బీ రోడ్డుకు ఆనుకొని డ్రైనేజీ లేకపోవడంతో వర్షం నీరు ఇళ్ల మధ్య లోనికి వస్తుంది. పంచాయతీ నిధులు చాలకపోవడంతో పనులు చేపట్టలేదు. డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయాలని వినతిపత్రం ఇచ్చాను. పంచాయతీ అధికారులకు తెలుపుతున్నట్లు కలెక్టర్ చెప్పారు.

–గండేపల్లి సూర్యనారాయణ, విశ్రాంత ఉపాధ్యాయుడు, గొలుగొండ గ్రామం

60 ఏళ్లుగా ఉంటున్నా..



అరవై సంవత్సరాల క్రితం ప్రభుత్వం ఇచ్చిన స్థలంలో నివసిస్తున్నాను. ఇంటి పన్ను, కరెంటు బిల్లులు ఉన్నాయి. ఇటీవల ఇళ్లు నిర్మించుకుందామంటే చుట్టుపక్కలవారు దౌర్జన్యం చేసి కట్టుకోనివ్వలేదు. న్యాయం చేయమని కలెక్టర్ గారికి అర్జీ పెట్టుకున్నాను. వెంటనే రెవెన్యూ అధికారులను పంపుతున్నట్లు చెప్పారు.

– పోలిరెడ్డి సన్నమ్మ, కొత్తమల్లంపేట గ్రామం

పింఛన్ కోసం..



నాకు 2021 వరకు పింఛన్ వచ్చింది. తర్వాత రాలేదు. నా కుమారుడికి ఆర్టీసీలో బస్ డ్రైవర్‌గా ఉద్యోగం వచ్చింది. పెళ్లి అయ్యాక సంవత్సరం క్రితం నా కుమారుడు, కోడలు కొత్త రేషన్ కార్డు తీసుకున్నారు. పింఛన్ పునరుద్ధరించమని వినతి పత్రం ఇచ్చాను.

– మాకిరెడ్డి రామణమ్మ, మల్లంపేట

విన్నపాలు వినవలె..

గొలుగొండ: గొలుగొండలో శుక్రవారం జరిగిన 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమంలో మండలం నలుమూలల నుంచి అర్జీలు వచ్చాయి. 186మంది వచ్చి కలెక్టర్ తదితర జిల్లా అధికారులకు వినతులు సమర్పించారు. వ్యక్తిగత సమస్యల నుంచి సామూహిక సమస్యల వరకు వివిధ రకాల అర్జీలను బాధితులు అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు.

విద్యార్థుల ఆరోగ్యంపై నిర్లక్ష్యం సహించను

- తేడా వస్తే కఠిన చర్యలు
- కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి హెచ్చరిక



కలెక్టర్ సమక్షంలో బాలికలకు వైద్య పరీక్షలు

గొలుగొండ: విద్యార్థుల ఆరోగ్యం విషయంలో వైద్య సిబ్బంది, విద్యాశాఖ నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి హెచ్చరించారు. ఆయన గొలుగొండలో 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమం ముగిసిన అనంతరం కొత్తమల్లంపేట గ్రామంలో ఉన్న విలేజ్ క్లినిక్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆ సందర్భంగా విద్యార్థులకు రక్త పరీక్షల వివరాల గురించి ప్రశ్నించగా సిబ్బంది నుంచి పొంతన లేని సమాధానాలు వచ్చాయి. దీంతో అక్కడి నుంచి నేరుగా జిల్లా పరిషత్ హైస్కూల్‌కు వెళ్లి విద్యార్థులకు రక్త పరీక్షలు చేయించారు. గతంలో చేసినట్టు రికార్డుల్లో నమోదైన పరీక్ష ఫలితాలకు, ప్రస్తుతం చేసిన పరీక్షల ఫలితాలకు తేడాలను గుర్తించారు. విద్యార్థుల ఆరోగ్యం విషయంలో తేడా వస్తే సహించేది లేదని హెచ్చరించారు. ప్రభుత్వ పాఠశాలలు, విలేజ్ క్లినిక్‌లు, ఆస్పత్రులను ఎప్పటికప్పుడు పరిశీలించాలని డీఈవో వెంకటలక్ష్మమ్మ, డీఎంహెచ్‌వో హేమంత్‌లను ఆయన ఆదేశించారు.

రేపటి నుంచి కనక మహాలక్ష్మి పవిత్రోత్సవాలు

డాబాగార్డెన్స్: బురుజుపేటలో కొలువైన కనక మహాలక్ష్మి దేవస్థానంలో ఈ నెల 24 నుంచి 27 వరకు పవిత్రోత్సవాలు నిర్వహించనున్నారు. ఇందుకు అవసరమైన పవిత్రాలను సిద్ధం చేశారు. వాటిని వేద పండితులు పర్యవేక్షిస్తున్నారు. వార్షిక ఉత్సవాల్లో వైదికపరంగా ఎలాంటి దోషాలు, పొరపాట్లు జరిగినా వాటిని నివారించేందుకు పవిత్రోత్సవాలు నిర్వహించడం పరిపాటి. ఈ నేపథ్యంలో ఈ నెల 24 నుంచి అమ్మవారికి విశేష పూజలు నిర్వహిస్తారు. చివరి రోజున పవిత్ర విసర్జన, మహాపూర్ణాహుతి, ఆశీర్వచనం అనంతరం భక్తులకు గర్భాలయ దర్శనం ఉంటుంది. పవిత్రోత్సవాలు సందర్భంగా ఈ నెల 26న ఉదయం 9 నుంచి 27వ తేదీ ఉదయం 11 గంటల వరకు అంతరాలయ దర్శనాలు, పంచామృతాభిషేక సేవలు నిలిపివేస్తున్నట్లు ఈవో కె.శిరీష తెలిపారు.

న్యూస్‌రీల్

చెస్ లోగో ఆవిష్కరణ



చెస్ లోగో ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి

విశాఖ స్పోర్ట్స్ : జాతీయస్థాయి అండర్ 11 చదరంగం చాంపియన్‌షిప్ లోగోను వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి శుక్రవారం విడుదల చేశారు. పోర్ట్ ఇండోర్ స్టేడియంలో వచ్చే నెల 1 నుంచి ఏడురోజుల పాటు పోటీలు జరగనున్నాయి. ఇప్పటికే దేశంలోని 27 రాష్ట్రాలకు చెందిన అండర్ 11 బాలబాలికలు 331మంది ఎంట్రీలను నమోదు చేసుకున్నారు. ఏపీ నుంచి 83 మంది తలపడుతున్నారు. ఈపోటీల నిర్వాహణ కమిటీకి చీఫ్ పాట్రన్‌గా వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కేకే రాజు వ్యవహరించనున్నారు.

షిప్పింగ్, పోర్టుల మంత్రిని కలిసిన ఎంపీ సత్యవతి



మంత్రి సోనోవాల్‌కు వినతిపత్రం అందిస్తున్న ఎంపీ సత్యవతి

అనకాపల్లిటౌన్: అనకాపల్లి మున్సిపల్ స్టేడియం అభివృద్ధికి సీఎస్ఆర్ నిధులు మంజూరు చేసి, సహకరించాల్సిందిగా కేంద్ర షిప్పింగ్, పోర్టుల అభివృద్ధి మంత్రి శర్వానంద్ సోనోవాల్‌ను ఎంపీ బీవీ సత్యవతి కోరారు. ఈ మేరకు ఆమె ఢిల్లీలోని మంత్రి కార్యాలయంలో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఎంపీ సత్యవతి మాట్లాడుతూ అన్ని రకాల క్రీడలకు అనుగుణంగా స్టేడియంను అభివృద్ధి చేయడానికి ఇప్పటికే ప్రణాళికలు సిద్ధం చేసినట్లు చెప్పారు. ఇందు కోసం ఎంపీ నిధులను వెచ్చిస్తున్నట్లు పేర్కొన్నారు. సదరు మంత్రిత్వ శాఖ నుంచి కూడా సహకారం అందించాల్సిందిగా కోరారు.

సేవే కర్తవ్యంగా పనిచేయాలి

- నార్త్ జోన్ ఆర్ఎఫ్‌వో నిరంజన్‌రెడ్డి



సిబ్బంది యోగక్షేమాలు తెలుసుకుంటున్న ఆర్ఎఫ్‌వో నిరంజన్‌రెడ్డి

మాడుగుల: సేవే కర్తవ్యంగా అగ్నిమాపక సిబ్బంది పని చేయాలని నార్త్ జోన్ ఆర్ఎఫ్‌వో డి.నిరంజన్‌రెడ్డి అన్నారు. గురువారం రాత్రి స్థానిక అగ్నిమాపక కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం సిబ్బంది యోగక్షేమాలు తెలుసుకున్నారు.

నేడు జెడ్పీ స్థాయీ సంఘాల సమావేశాలు

మహారాణిపేట: ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ స్థాయీ సంఘాల సమావేశం శనివారం ఉదయం 10 గంటలకు చైర్‌పర్సన్ జె.సుభద్ర అధ్యక్షతన నిర్వహిస్తున్నారు. ఒకటి నుంచి ఏడు స్థాయీ సంఘాల సమావేశాలు ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు జరుగుతాయని జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహణాధికారి (సీఈవో) పి.శ్రీరామ్మూర్తి తెలిపారు. ఉమ్మడి విశాఖ జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, సభ్యులు, అధికారులు హాజరు కావాలని సీఈవో కోరారు.

ఇగ్నో ప్రవేశాల ప్రవేశాల గడువు పెంపు

ఎంవీపీకాలనీ: ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) 2023 జులై ప్రవేశాలకు సంబంధించి దరఖాస్తుల గడువును ఇగ్నో పొడిగించింది. ఈ మేరకు ఇగ్నో విశాఖపట్నం ప్రాంతీయ కేంద్రం సంచాలకుడు డాక్టర్ గోనిపాటి ధర్మారావు శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. ఇగ్నో ద్వారా అందిస్తున్న డిగ్రీ, పీజీ, ఎంబీఏ, డిప్లమో, సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశాలు కల్పించనున్నారు. ఈ ప్రవేశాలు పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో జరగనున్నాయి. కేంద్రం పరిధిలోని 5 జిల్లాల విద్యార్థులకు ప్రవేశాలు కల్పిస్తునున్నారు. https://ignouadmission.samarth.edu.in/ వెబ్‌సైట్ ద్వారా అర్హులైన విద్యార్థులు ఆయా కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 20వ తేదీ వరకు గడువును పొడిగించారు. పూర్తి వివరాలకు ఎంవీపీ కాలనీ ఉషోదయ కూడలిలోని ఇగ్నో కార్యాలయాన్ని సంప్రదించాలి.

దివ్యాంగుల ఉపకరణాల సరఫరాకు గుర్తింపు శిబిరాలు



తుమ్మపాల: జిల్లాలో ఉన్న దివ్యాంగులు, వృద్ధులకు ఉచిత ఉపకరణాలు అందించేందుకు జిల్లాలోని నాలుగు కేంద్రాల్లో గుర్తింపు శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరాల్లో గుర్తించిన వారికి అవసరమైన పరికరాలను హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ కృత్రిమ అవయవాల తయారీ కేంద్రం ఆలిమ్‌–కో ద్వారా సరఫరా చేస్తామన్నారు. ఈ నెల 26, 27, 28, 29 తేదీల్లో ఈ శిబిరాలు అనకాపల్లి, చోడవరం, యలమంచిలి, నర్సీపట్నంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతాయన్నారు. దివ్యాంగులు, వృద్ధులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

మండలాల వారీగా శిబిరాలు

- 26న అనకాపల్లి ఏఎంఏఎల్ కళాశాలలో అనకాపల్లి, అచ్యుతాపురం, కశింకోట, మునగపాక, పరవాడ, సబ్బవరం మండలాల వారికి గుర్తింపు శిబిరం నిర్వహించనున్నారు.
- 27న చోడవరం ప్రభుత్వ హైస్కూల్ కేంద్రంగా బుచ్చెయ్యపేట, చీడికాడ, చోడవరం, దేవరాపల్లి, కె.కోటపాడు, రావికమతం, వి.మాడుగుల మండలాల వారు నమోదు చేసుకోవచ్చు.
- 28న యలమంచిలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నక్కపల్లి, పాయకరావుపేట, ఎస్.రాయవరం మండలాలకు చెందిన వారు పాల్గొనవచ్చు.
- 29న పెదబొడ్డేపల్లి ఏపీ రెసిడెన్షియల్ పాఠశాలలో గొలుగొండ, కోటవురట్ల, మాకవరపాలెం, నర్సీపట్నం, నాతవరం, రోలుగుంట మండలాలవారికి పరీక్షలు నిర్వహించి, పరికరాలకు అర్హుల్ని ఎంపిక చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు.

ఉపకరణాల గుర్తింపు కొరకు హాజరయ్యే వారు మెడికల్ బోర్డు ద్వారా జారీ చేసిన సదరం ధ్రువీకరణపత్రం(40 శాతం/అంతకన్నా ఎక్కువ), ఆదాయ ధ్రువీకరణపత్రం(నెలకు రూ.15 వేలకు మించకుండా), రేషన్‌కార్డు లేదా ఓటర్ కార్డు, ఆధార్ కార్డు, రెండు పాస్‌పోర్టుసైజు ఫొటోలు(వైకల్యం కనిపించేలా), యుడీఐడీకార్డు వెంట తీసుకురావాలన్నారు. గత మూడేళ్ల వ్యవధిలో ఈ ఉపకరణాలు తీసుకున్న వారు అర్హులు కారని పేర్కొన్నారు. శిబిరాలలో ఏ విధమైన వైద్య ధ్రువీకరణపత్రాలు, పింఛన్లు మంజూరు చేయరని తెలిపారు. జిల్లాలో అర్హత ఉన్న దివ్యాంగులందరూ ఈ శిబిరాలకు హాజరై, అవసరమైన ఉపకరణాలు పొందవచ్చని వెల్లడించారు.

జెట్టీ నిర్మాణాన్ని త్వరగా పూర్తిచేయాలి

- అసెంబ్లీలో ఎమ్మెల్యే బాబూరావు



అసెంబ్లీ సమావేశాల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాబూరావు

నక్కపల్లి: నియోజక వర్గ మత్స్యకారుల కోరిక మేరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంజూరు చేసిన ఫిష్‌ల్యాండింగ్ సెంటర్, జెట్టీ నిర్మాణ పనుల్ని త్వరితగతిన పూర్తి చేయాలని పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు కోరారు. శుక్రవారం ఆయన అసెంబ్లీ సమావేశాల్లో నియోజకవర్గ సమస్యలపై మాట్లాడారు. పాయకరావుపేట నియోజకవర్గంలో నాలుగు మండలాల్లో సుమారు 30 వేల మంది మత్స్యకారులు చేపల వేటే ప్రధాన వృత్తిగా జీవిస్తున్నారని తెలిపారు. ఈ ప్రాంతంలో వేటాడిన మత్స్య సంపదకు సరైన మార్కెటింగ్ సదుపాయం లేక మత్స్యకారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీన్ని గమనించి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఫిష్‌లాండింగ్ సెంటర్, జెట్టీలను మంజూరు చేశారని పేర్కొన్నారు. దీని నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని అధికార యంత్రాంగం ఇప్పటికే ఎంపిక చేసిందన్నారు. రెవెన్యూ, అటవీశాఖల నుంచి ఉన్న సాంకేతిక సమస్యల్ని పరిష్కరించి వెంటనే, నిర్మాణాలను చేపట్టాలని కోరారు. అడ్డురోడ్డు నుంచి నర్సీపట్నం వెళ్లే ప్రధాన రహదారి సుమారు 15 కిలోమీటర్ల మేర శిథిలమయిందని, దీనికి తక్షణమే మరమ్మతులు చేపట్టాలన్నారు. కోటవురట్ల మండలం పందూరు వరహా నదిపై బ్రిడ్జి ఏడేళ్ల క్రితం వచ్చిన తుపానుకు కూలిపోయిందని, దాని స్థానం కొత్త బ్రిడ్జిని నిర్మించాలని సభ దృష్టికి తీసుకెళ్లినట్లు ఎమ్మెల్యే బాబూరావు తెలిపారు.

ఉత్తరాంధ్ర కలల రాజధాని విశాఖ

- విశాఖ నుంచే పాలన నిర్ణయానికి మద్దతుగా పూజలు
- ఉత్తరాంధ్ర వాసులు సీఎం జగన్‌కు రుణపడి ఉంటారు
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న బొడ్డేడ ప్రసాద్



గణపతి పూజలు చేస్తున్న బొడ్డే ప్రసాద్, పార్టీ శ్రేణులు

అనకాపల్లి టౌన్: విశాఖను పరిపాలనా రాజధానిగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించడంతో ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల వాంఛ నెరవేరినట్టయిందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ అన్నారు. విశాఖ కేంద్రంగా, విజయదశమి నుంచి పాలన కొనసాగించేందుకు సీఎం జగన్ కేబినెట్‌లో పేర్కొనడాన్ని పురస్కరించుకుని స్థానిక నెహ్రూచౌక్ గణపతి ఆలయంలో శుక్రవారం ఆయన ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ ఇప్పటికే ప్రపంచ వ్యాప్తంగా పేరొందిందని, ఉత్తరాంధ్ర అభివృద్ధికి విశాఖ రాజధాని కావడం ఎంతగానో దోహదపడుతుందన్నారు. విశాఖే ప్రజా రాజధాని అని, అమరావతి ఓ కులానికే రాజధాని అని ఆక్షేపించారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు మాట్లాడుతూ ఒక సామాజిక వర్గానికి చెందిన వ్యక్తులు వేలాది కోట్ల రూపాయలతో రియల్ ఎస్టేట్ వ్యాపారాలు చేస్తూ, అమరావతిలో రాజధాని ఏర్పాటు చేయాలని కోర్టులను ఆశ్రయించడాన్ని ఆక్షేపించారు. రాష్ట్ర నలుమూలల నుంచి విశాఖకు రావడానికి అనేక సౌకర్యాలు ఉన్నాయని, వెనుకబడిన ఉత్తరాంధ్ర అభివృద్ధికి విశాఖ రాజధాని కీలకంగా మారనుందన్నారు. తొలుత గణపతి ఆలయం ముందు 101 కొబ్బరికాయలు కొట్టి పట్టణవాసులకు స్వీట్లు పంచిపెట్టి, సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గొర్లి సూరిబాబు, జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు, జిల్లా యువజన విభాగం కార్యదర్శి జాజుల రమేష్, పట్టణ మహిళా విభాగం అధ్యక్షురాలు ఎ.వి. రత్నకుమారి, కశింకోట మండల అధ్యక్షుడు మలసాల కిశోర్, ఎన్టీఆర్ వైద్యాలయ అభివృద్ధి కమిటీ డైరెక్టర్ జి.రామ్మూర్తి, నూకాంబిక అమ్మవారి దేవస్థానం చైర్మన్ కొణతాల మురళీకృష్ణ, సూరిశెట్టి రమణ అప్పారావు, గవర కార్పొరేషన్ డైరెక్టర్ శివ, అధికసంఖ్యలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొన్నారు.

అవగాహనతోనే హెచ్‌ఐవీ నియంత్రణ



పోటీలను ప్రారంభిస్తున్న హేమంత్

అనకాపల్లిటౌన్: ఎయిడ్స్ మహమ్మారి నియంత్రణకు యువత అవగాహన పెంచుకోవాలని డీఎంహెచ్‌వో డాక్టర్ ఎ.హేమంత్ పిలుపునిచ్చారు. రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సొసైటీ ఆదేశాల మేరకు జిల్లా ఎయిడ్స్ నియంత్రణ, నివారణ సంస్థ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సంయుక్త ఆధ్వర్యంలో పూడిమడక లోని వైఎస్సార్ విగ్రహం వద్ద నిర్వహించిన యూత్ ఫెస్ట్ 2కే రెడ్‌రన్ మారథాన్–2023ని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెచ్‌ఐవీ నివారణపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాల్సిన బాధ్యత యువతపై ఉందన్నారు. పోటీలకు జిల్లాలోని పలు విద్యాసంస్థల నుంచి 200 మంది విద్యార్థులు హాజరయ్యారు. జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ అధికారి బాలాజీ మాట్లాడుతూ హెచ్‌ఐవీ రహిత జిల్లాకు అనకాపల్లిని నిలిపేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలన్నారు. ఈ పోటీలు స్థానిక ఎన్టీఆర్ స్టేడియానికి చేరుకోవడంతో ముగిశాయి. విజేతలకు బహుమతులందించారు. కార్యక్రమంలో వైద్యాలయం ఆర్ఎంవో, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

అత్యాశకు పోయి హత్య

అతడికి పర్యాటక ప్రదేశాలు చూడటం హాబీ.. వాటితోపాటు స్నేహితులతో జలాసాలు చేయడం అలవాటు.. అవే కొంపముంచాయి. ఇంత విలాస జీవితం గడుపుతున్న అతడి వద్ద పెద్ద మొత్తంలో డబ్బు ఉంటుందని, కాజేయాలని ఇద్దరు యువకులు అత్యాశకు పోయి మట్టుబెట్టారు. ఆపై పోలీసుల కళ్లు గప్పి తప్పించుకుని తిరుగుతున్న వారిని చాకచక్యంగా పట్టుకున్నారు.

- పర్యాటకుడు రవితో పరిచయం
- ఆపై చంపేసి పరారీ
- ఇద్దరు నిందితుల అరెస్టు
- డబ్బు కోసమే హత్య చేశారన్న ఏఎస్పీ



వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ అదీరాజ్ సింగ్ రాణా

నర్సీపట్నం: మాకవరపాలెం మండలం రామన్నపాలెం వద్ద ఈ నెల 20న జరిగిన ధనిమిరెడ్డి రవి (36)హత్య కేసును పోలీసు ఛేదించారు. ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. దీనికి సంబంధించిన వివరాలను శుక్రవారం రాత్రి తన కార్యాలయంలో ఏఎస్పీ అదీరాజ్‌సింగ్ రాణా వెల్లడించారు. రవి తన స్నేహితుడు సురేష్‌తో కలిసి ఈ నెల 12న విశాఖపట్నం వెళ్లాడు. ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఆటో డ్రైవర్ మలిశెట్టి అరవింద్‌తో విశాఖ నగరంలో టూరిస్టు ప్రదేశాలను చూపించడానికి రూ.2,500కు బేరం కుదుర్చుకున్నాడు. మూడు రోజుల పాటు ముగ్గురు ఎంజాయ్ చేశారు. అరవింద్‌కు ఫోన్ పే లేకపోవడంతో అతని మిత్రుడు తెప్పల గణేష్‌కు రవి ఫోన్ పే ద్వారా డబ్బులు చెల్లించేవాడు. మూడు రోజుల తర్వాత తన స్నేహితుడు సురేష్‌ను కాకినాడలో విడిచిపెట్టి, రవి ఈ నెల 17న నర్సీపట్నం వచ్చి వెంకటాద్రి లాడ్జిలో దిగాడు. 19న అరవింద్‌కు ఫోన్ చేసి నర్సీపట్నం రమ్మన్నాడు. అరవింద్, అతని స్నేహితుడు గణేష్ ఆటోలో అక్కడకు రాత్రి 9 గంటలకు చేరుకున్నారు. వీరు ముగ్గురు రూమ్‌లో తాగి అర్ధరాత్రి సమయంలో ఆటోలో మాకవరపాలెం వచ్చారు. విచ్చలవిడిగా డబ్బులు ఖర్చు చేస్తున్న రవి వద్ద ఎక్కువ నగదు ఉంటుందని భావించిన నిందితులు అరవింద్, గణేష్ రవిని హత్య చేసి రోడ్డు పక్కన పొదల్లో పడేసి పరారయ్యారు. కాల్ డేటా, సీసీ పుటేజీల ఆధారంగా నిందితులిద్దరినీ అరెస్టు చేశామని ఏఎస్పీ తెలిపారు. సమావేశంలో సీఐ రమణయ్య, ఎస్సై రామకృష్ణారావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పోలింగ్ కేంద్రాల్లో సమస్యలుంటే చెప్పండి

- కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి


మాట్లాడుతున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

తుమ్మపాల: పోలింగ్ కేంద్రాల్లో ఏవైన సమస్యలుంటే వెంటనే తెలియజేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు. గుర్తింపు పొందిన అన్ని రాజకీయపార్టీల ప్రతినిధులు, ఈఆర్వో, ఏఈఆర్వోలతో కలెక్టరేట్‌లో శుక్రవారం సమావేశమయ్యారు. జిల్లాలో పోలింగ్ కేంద్రాల్లో మార్పులు, చేర్పులు, మరమ్మతులు తదితర విషయాలను తెలియజేయాలన్నారు. కేంద్రాల క్రమబద్ధీకరణ(రేషనలైజేషన్), మరమ్మతులు ఇప్పటికే పూర్తి చేశామని, సమస్యలుంటే తెలియజేయాలన్నారు. వీఆర్వోలైన ఆర్డీవోలు చిన్నికృష్ణ, జయరాం, ఎస్‌డీసీలు ప్రమీల గాంధీ, జ్ఞానవేణి, రామలక్ష్మి, ఏఈఆర్వోలైన తహసీల్దార్లు రత్నం, గంగాధరరావు, అన్నాజీరావు, తిరుమలబాబు, రాజకీయ పార్టీల ప్రతినిధులు గొర్లి సూరిబాబు(వైఎస్సార్‌సీపీ), జి.చెన్నారావు(బీఎస్పీ), సీహెచ్.నాగేశ్వరరావు(బీజేపీ), బి.శ్రీనివాసరావు(టీడీపీ), కె.హరనాథబాబు(ఆమ్‌ఆద్మీ), ఐ.ఆర్.గంగాధర్(కాంగ్రెస్), ఆర్.శంకరరావు(సీపీఎం) పాల్గొన్నారు.

బొకారో ఎక్స్‌ప్రెస్ దారి మళ్లింపు

తాటిచెట్లపాలెం: ధన్‌బాద్-అలెప్పి(13351) బొకారో ఎక్స్‌ప్రెస్ వచ్చే నెల 2 నుంచి 10వ తేదీ వరకు మళ్లించిన మార్గంలో వయా నిడదవోలు, భీమవరం టౌన్, గుడివాడ, విజయవాడ మీదుగా రాకపోకలు సాగిస్తుంది. తాడేపల్లిగూడెం, ఏలూరు మీదుగా ప్రయాణించదు.

స్కూల్ గేమ్స్‌లో మెరిసిన క్రీడా ఆణిముత్యాలు

- జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీలకు పలువురి ఎంపిక

జిల్లాలో క్రీడా ఆణిముత్యాలకు కొదవ లేదు. సరైన అవకాశం కోసం ఎదురు చూస్తున్న వారంతా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన స్కూల్ గేమ్స్‌లో తమ సత్తా చాటారు. ఈ మేరకు జిల్లా, నియోజకవర్గ స్థాయి పోటీల్లో హవా కొనసాగించారు.రాష్ట్ర, జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరిని ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.



విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్


ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు


ఎంపికైన విద్యార్థినులతో హెచ్‌ఎం నారాయణ


ఎంపికైన విద్యార్థినులతో పీడీ లక్ష్మి


హాకీ పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

పాయకరావుపేట: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 20న విశాఖపట్నం ఎస్.ఎఫ్.ఎస్. స్కూల్‌లో నిర్వహించిన అండర్ – 17 బాలికల బాస్కెట్ బాల్ పోటీల్లో శ్రీ ప్రకాష్ విద్యార్థిని పి.దివ్య (10వ తరగతి) ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. శుక్రవారం ఆమెను విద్యా సంస్థల అధినేత సిహెచ్.వి.కె. నరసింహారావు, సంయుక్త కార్యదర్శి సిహెచ్.విజయ్ ప్రకాష్, సీనియర్ ప్రిన్సిపాల్ ఎం.వి.వి.ఎస్. మూర్తి తదితరులు అభినందించారు.

జిల్లా స్థాయి పోటీలకు దేవవరం విద్యార్థులు

నక్కపల్లి: జిల్లా స్థాయి టెన్నికాయిట్ పోటీలకు దేవవరం విద్యార్థులు ఎంపికయ్యారు. ఇటీవల కోటవురట్ల మండలం రాట్నాపాలెంలో జరిగిన నియోజకవర్గ స్థాయి టెన్నికాయిట్ పోటీల్లో అండర్ – 17 బాలుర విభాగంలో దేవవరం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు గింజాల గణేస్, అనుసూరి సతీష్, అండర్ – 14 బాలుర విభాగంలో మునుకుర్తి వెంకటేష్, గింజాల లోవరాజు ఎంపికయ్యారని హెచ్‌ఎం వేమగిరి నూకరాజు తెలిపారు. త్రోబాల్‌లో అండర్ – 17 బాలుర విభాగంలో గింజాల గణేష్, అండర్ –14లో మునుకుర్తి వెంకటేష్ ఎంపికయ్యారన్నారు. వీరిని హెచ్‌ఎంతోపాటు ఉపాధ్యాయుడు నర్సింహమూర్తి, పీఈటీ దుంగానాగరాజు అభినందించారు.

పాములవాక విద్యార్థినులు

కోటవురట్ల: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీల్లో పాములవాక జెడ్పీ హైస్కూల్ విద్యార్థినులు ప్రతిభ చూపి జిల్లా స్థాయికి అర్హత సాధించారు. అండర్ –17 బాలికల విభాగంలో ఖోఖోలో పి.కిరణ్ మహి, త్రోబాల్‌లో కె.కుసుమ, ఎస్.మధుశాలిని, కె.పూర్ణిమ, ఆర్.కావ్య, బాల్ బ్యాడ్మింటన్‌లో ఆర్.కావ్య, ఎస్.కె.రాజన్ బీబీ జ్యోత్స్న, ఎస్.అక్షయ యాదవ్, కె.పూర్ణిమ, షటిల్ బ్యాడ్మింటన్‌లో కె.పూర్ణిమ జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరిని హెచ్‌ఎం కె.వి.లక్ష్మీనారాయణ, వ్యాయామ ఉపాధ్యాయుడు వి.వి.అచ్యుతరావు, ఉపాధ్యాయులు శుక్రవారం అభినందించారు.

కె.వి.పురం విద్యార్థినులు

నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీల్లో కె.వెంకటాపురం జెడ్పీ హైస్కూల్ విద్యార్థినులు ప్రతిభ చూపారు. అండర్ –14, 17 విభాగాల్లోని ఖోఖోలో పి.స్పందన, వి.ఝాన్సీ, కబడ్డీలో ఎస్.లలిత, బాల్ బ్యాడ్మింటన్‌లో ఎస్.లలిత, పి.ధనలక్ష్మి రాణించి జిల్లా స్థాయికి ఎంపికైనట్టు పీడీ లక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా వీరిని హెచ్‌ఎం షేక్ అల్లావుద్దీన్, ఉపాధ్యాయులు అభినందించారు.

రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు..

ఎస్.రాయవరం: మండలంలోని పి.ధర్మవరం ఉన్నత పాఠశాల నుంచి ఏడుగురు విద్యార్థులు రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు ఎంపికైనట్టు హెచ్‌ఎం ఎస్.వి. రమణారావు శుక్రవారం తెలిపారు. ఇటీవల స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నక్కపల్లిలో ఈ పోటీలు నిర్వహించారన్నారు. అండర్ – 14 విభాగం నుంచి విద్యార్థినులు నిఖిత, నిహారిక, శ్రావ్య, గీతన్విత, అండర్ –17 విభాగంలో మహాలక్ష్మి, జయశ్రీ, వివేక్ ఎంపికయ్యారన్నారు. వీరిని ఉపాధ్యాయులు అభినందించారు.

25 నుంచి ఉమ్మడి విశాఖ జిల్లా క్రీడా జట్ల ఎంపిక

చోడవరం రూరల్: ఉమ్మడి విశాఖ జిల్లా అండర్–19 క్రీడా జట్ల ఎంపిక పోటీలు వివిధ కళాశాలలు, వేదికలలో ఈ నెల 25 నుంచి నిర్వహించనున్నట్టు జూనియర్ కాలేజీల గేమ్స్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ గోతిరెడ్డి రాంబాబు తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో వివిధ క్రీడాంశాలకు సంబంధించి జట్ల ఎంపిక 25 నుంచి వచ్చేనెల 7వ తేదీ వరకు జరుగుతుందని చెప్పారు. ఈ మేరకు జిల్లా సెలక్షన్స్ షెడ్యూల్‌ను శుక్రవారం ఆయన పత్రికలకు విడుదల చేశారు. 2005 జనవరి ఒకటి తర్వాత జన్మించినవారు, స్టూడెంట్ ఐడీ నంబర్, అడ్మిషన్ నంబర్‌లతో సహా ఆయా విద్యాసంస్థల అధిపతుల ధ్రువీకరణ పత్రాలను కలిగి ఉన్నవారు ఈ పోటీల్లో పాల్గొనవచ్చని తెలిపారు. అనకాపల్లి ఏఎంఏఎల్ కళాశాలలో ఈనెల 25న అథ్లెటిక్స్, పవర్ లిఫ్టింగ్, వెయిట్ లిఫ్టింగ్, 26న క్రికెట్, ఖో–ఖో జట్ల ఎంపిక జరుగుతుందని, అదే రోజు కొయ్యూరు గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో రెజ్లింగ్ జట్లను ఎంపిక చేస్తారని చెప్పారు. 27న విశాఖ ఏయూ గ్రౌండ్స్‌లో లాన్ టెన్నిస్, టౌన్ కొత్తరోడ్ మున్సిపల్ స్టేడియంలో ఫుట్‌బాల్, హ్యాండ్ బాల్, టేబిల్ టెన్నిస్, నెట్ బాల్, బ్యాడ్మింటన్ జట్లను ఎంపిక చేస్తారు. 29న విశాఖ ఏయూ గ్రౌండ్స్‌లో బాక్సింగ్ క్రీడాకారుల సెలక్షన్స్ జరుగుతాయి. 30న సబ్బవరంలోని ఏపీ సాంఘిక సంక్షేమ జూనియర్ కళాశాలలో క్యారమ్స్, చెస్, యోగా, జిమ్నాస్టిక్స్ జట్ల ఎంపిక జరుగుతుంది. అక్టోబర్ 3న విశాఖ శ్రీకృష్ణాపురం సాంఘిక సంక్షేమ కళాశాలలో బేస్ బాల్, ఆర్చరీ, రోప్ స్కిప్పింగ్, ఫెన్సింగ్, షూటింగ్‌లలో ఎంపిక జరుగుతుంది. వచ్చేనెల 4న నక్కపల్లి జూనియర్ కళాశాలలో హాకీ జట్టు, 5న విశాఖ పోర్టు హైస్కూల్ గ్రౌండ్‌లో టార్గెట్ బాల్, పోర్టు స్టేడియంలో బాస్కెట్ బాల్ జట్ల ఎంపిక, 6న గాజువాక బ్యూల స్కూల్‌లో కరాటే, జూడో, తైక్వాండో జట్లకు, 7న విశాఖ ఉడా పార్కులో స్కేటింగ్, స్వర్ణ భారతి స్టేడియంలో స్విమ్మింగ్ జట్ల ఎంపిక జరుగుతుందని రాంబాబు తెలిపారు. మరిన్ని క్రీడాంశాలకు సంబంధించి ఎంపిక తేదీల వివరాలను, వివిధ పోటీలకు సంబంధించి మార్పులు జరిగినా తెలియజేస్తారు. ఈ ఎంపిక పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు ఆయా తేదీల్లో ఉదయం 10గంటలకు నిర్దేశిత మైదానాలకు చేరుకోవాలన్నారు.

మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన

- 93 మందికి నియామక పత్రాల పంపిణీ

మాకవరపాలెం: మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. మండలంలోని తామరం అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, అవంతి కళాశాల ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించారు. దీనికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 824 మంది యువతీ యువకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా 15 ప్రముఖ కంపెనీలైన మిరాకిల్ సాఫ్ట్‌వేర్ సిస్టమ్స్, డాక్టరు రెడ్డీస్ లేబొరేటరీ, డెక్కన్ కెమికల్స్, యెకోహామా, తదితర కంపెనీల ప్రతినిధులు పాల్గొని అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. 93 మందిని ఎంపిక చేసి నియామక పత్రాలను అందజేశారు. అనంతరం ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి చాముండేశ్వరరావు మాట్లాడుతూ నిరుద్యోగులు వచ్చిన ప్రతి అవకాశాన్నీ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ మేళాలో 184 మంది 2వ ప్రక్రియకు అర్హత సాధించగా, 93 మందిని తొలుత ఎంపిక చేసి నియామక పత్రాలు అందించామన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ సి.మోహన్‌రావు, ప్లేస్‌మెంట్ అధికారి శ్రీనివాసరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.


జాబ్‌మేళాకు హాజరైన యువతీ, యువకులు

ప్రజల భాగస్వామ్యంతోనే జేజేఎం విజయవంతం

- క్షేత్రస్థాయిలో జల్‌జీవన్ మిషన్ పనుల పరిశీలన

కె.కోటపాడు: ప్రజల భాగస్వామ్యంతోనే జల్ జీవన్ మిషన్ (జేజేఎం) విజయవంతం కానుందని నేషనల్ జల్ జీవన్ మిషన్ సభ్యులు ఈశ్వర్‌చంద్ జైన్, సుశీల్‌కుమార్ చౌబే తెలిపారు. హర్ ఘర్ జల్‌లో భాగంగా కె.కోటపాడు మండలంలోని ఐదు గ్రామాల్లో శుక్రవారం వారు పర్యటించారు. ఆయా గ్రామాల్లో రక్షిత పథకాల నిర్మాణాలు, పంప్ హౌస్, ఇంటింటి కుళాయిలు, మరుగుదొడ్డి, ఇంకుడు గుంతల నిర్మాణాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. విలేజ్ వాటర్, శానిటేషన్ కమిటీ ద్వారా ప్రతి నెలా గ్రామస్తులు సమావేశమై మంచినీటి నిర్వహణపై ఏమైనా సమస్యలు ఉంటే చర్చించుకోవాలని సూచించారు. గ్రామాల్లో ఒక్కో మనిషికి కనీసం 55 లీటర్ల నీరు అవసరంగా ఇంటింటికీ సరఫరా కావాలన్నారు. గొట్లాంలో 280 ఇళ్లకు, పిండ్రంగిలో 470 ఇళ్లకు, డి.అగ్రహారంలో 134 ఇళ్లకు, ఆర్.వై.అగ్రహారంలో 300 ఇళ్లకు, వి.సంతపాలెంలో 290 ఇళ్లకు కుళాయిలు ఏర్పాటు చేసి ఇప్పటికే రోజూ సురక్షిత నీటిని అందిస్తున్నట్లు కమిటీ సభ్యులకు ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ అల్లు సూర్యనారాయణ వివరించారు. ఏఈ ఎ.శ్వేత, జి.లక్ష్మణరావు, స్వప్న, ఈవోపీఆర్డీ ప్రసాద్, జిల్లా మానటరింగ్ కమిటీ సభ్యులు చైతన్య, నరేష్, పుల్లయ్య, వేచలపు సత్యనారాయణ, గొట్లాం సర్పంచ్ గంతకర్ల చిన్నమ్మలు, ఎంపీటీసీ వర్రి రామునాయుడు పాల్గొన్నారు.

కొత్తపెంటలో... దేవరాపల్లి: దేవరాపల్లి మండలం కొత్తపెంటలో కేంద్ర జలశక్తి నుంచి వచ్చిన నేషనల్ జలజీవన్ మిషన్ సభ్యులు (నేషనల్ వాష్ ఎక్స్‌పర్ట్స్) ఈశ్వర్‌చంద్ జైన్, సుశీల్‌కుమార్ చౌబే శుక్రవారం సాయంత్రం పర్యటించారు. ఈ సందర్భంగా జలజీవన్ మిషన్ నిధులతో నూతనంగా నిర్మించిన మంచినీటి ట్యాంక్‌తోపాటు ఇంటింటా ఏర్పాటు చేసిన కుళాయి కనెక్షన్లను వారు క్షేత్ర స్థాయిలో పర్యటించి క్షుణ్ణంగా పరిశీలించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో జలజీవన్ మిషన్ పనులను పూర్తి చేసి ప్రతీ ఇంటికి కుళాయి నీటిని త్వరితగతిన సరఫరా చేయాలని డీఈ అల్లు సూర్యనారాయణ, ఏఈ కె. చంద్రశేఖర్‌లకు సూచించారు. సర్పంచ్ రొంగలి వెంకటరావు, ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ జి. సంతోషి నళిని పాల్గొన్నారు.


నీటి నాణ్యత పరీక్షలపై అడిగి తెలుసుకుంటున్న సభ్యులు ఈశ్వర్‌చంద్ జైన్, సుశీల్‌కుమార్ చౌబే


కొత్తపెంటలో కుళాయిని పరిశీలిస్తున్న కేంద్ర జేజేఎం బృంద సభ్యులు

ఆధునికీకరించిన తహసీల్దార్ కార్యాలయం ప్రారంభం

గొలుగొండ: స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, జాయింట్ కలెక్టర్ జాహ్నవి శుక్రవారం ప్రారంభించారు. ఇక్కడ కార్యాలయ భవనం పూర్తిగా శిథిలం కావడంతో సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ తన ప్రత్యేక నిధుల నుంచి రూ. 4.5 లక్షలు మంజూరు చేశారు. వాటితో తహసీల్దార్ ఆనందరావు ఆధునికీకరణ పనులు శరవేగంగా పూర్తి చేయించారు. కార్యక్రమంలో నర్సీపట్నం ఆర్డీవో జయరాం పాల్గొన్నారు.


కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్, జేసీ

బాల్య వివాహాలపై కేసులు నమోదు చేయండి

- రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు సీతారాం

నర్సీపట్నం: బాల్య వివాహాలపై ఎఫ్ఐఆర్ నమోదు చేసేలా పోలీసు అధికారులు కింద స్థాయి సిబ్బందికి ఆదేశాలు జారీ చేయాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం సూచించారు. శుక్రవారం కమిషన్ సభ్యులు నర్సీపట్నంలో పర్యటించారు. పర్యటనలో భాగంగా నర్సీపట్నం ఏఎస్పీ అధిరాజ్ సింగ్ రాణాను కలిశారు. బాల్య వివాహాలను అరికట్టేందుకు పోలీసులు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం ఆర్డీవో కార్యాలయ సమావేశ మందిరంలో అధికారులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బాల్యవివాహాలపై ప్రభుత్వం సీరియస్‌గా ఉందన్నారు. పోలీసు, ఐసీడీఎస్ అధికారులు సమన్వయంతో పని చేయటం ద్వారా బాల్య వివాహాలకు అడ్డుకట్ట వేయవచ్చని అభిప్రాయపడ్డారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. అనంతరం ఏఎస్పీ మాట్లాడుతూ కమిషన్ సభ్యులు తమ దృష్టికి తీసుకొచ్చిన అంశాలను పరిగణలోకి తీసుకుని బాల్య వివాహాలు జరగకుండా పటిష్టమైన చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో సీడీపీవో మేరీ సువార్త, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


ఏఎస్పీ అధిరాజ్ సింగ్ రాణాతో సమావేశమైన బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు సీతారాం

నైట్ వాచ్‌మన్ అనుమానాస్పద మృతి

నర్సీపట్నం: మున్సిపాలిటీలోని ధనిమిరెడ్డి వీధికి చెందిన లంక ప్రసాద్(36) అనుమానాస్పద మృతిపై కేసు నమోదు చేశామని టౌన్ సీఐ ఎస్.గణేష్ శుక్రవారం తెలిపారు. సీఐ వివరాల ప్రకారం... మండలంలోని జోగునాథునిపాలెం ప్రభుత్వ వైన్‌షాపులో మృతుడు ప్రసాద్ నైట్ వాచ్‌మన్‌గా పని చేస్తున్నాడు. ఈ నెల 19న తనతో గొడవపడి ఇంటి నుంచి వెళ్లిపోయి తిరిగి రాకపోవడంతో భార్య వరలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఇంటి నుంచి వెళ్లిన రోజు నుంచి అతడి ఆచూకీ కోసం బంధువులు వెతుకున్నారు. ఈ క్రమంలో పెదబొడ్డేపల్లి వద్ద కల్వర్టులో శవం ఉండటాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వారు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించి బంధువులకు సమాచారం ఇవ్వడంతో మృతదేహం లంక ప్రసాద్‌గా గుర్తించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళా రిజర్వేషన్లను వెంటనే అమలు చేయాలి

- మాజీ మంత్రి దాడి వీరభద్రరావు



అనకాపల్లి టౌన్: పార్లమెంట్ ఆమోదించిన మహిళా బిల్లును వెంటనే అమలు చేయాలని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దాడి వీరభద్రరావు అన్నారు. ఆయన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం విలేకర్లతో మాట్లాడారు. 2024 ఎన్నికల నుంచి అమలు చేయడానికి జనాభా లెక్కలు, పార్లమెంట్ నియోజకవర్గాల పునర్విభజన కమిటీలు అవసరం లేదన్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం మహిళల జనాభాను పరిగణనలోకి తీసుకొని వచ్చే ఎన్నికల నుంచే అమలు చేయవచ్చని చెప్పారు. పెద్ద నాయకుల నియోజకవర్గాలు ఎక్కడ మహిళలకు రిజర్వు అయిపోతాయో అనే భయంతోనే తూతూ మంత్రంగా బిల్లును ఆమోదించారన్నారు. మహిళల కోటాలో ఓబీసీలు, మైనార్టీలకు 33 శాతం అంతర్గత రిజర్వేషన్లు ఎందుకు పెట్టలేదని ప్రశ్నించారు. ఈమేరకు ఆయన రాష్ట్రపతి, ప్రధాని, కేంద్ర హోంమంత్రి, ముఖ్యమంత్రికి లేఖలు పంపారు.

నారపాకలో పట్టపగలే చోరీ

- రూ.50 వేలు, 3 తులాల బంగారు నగలతో ఉడాయింపు

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలం ఆవరాజం శివారు నారపాకలో పట్టపగలే గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. శుక్రవారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో నారపాక జంక్షన్‌కు సమీపంలోని మొల్లి నాగమణి ఇంట్లోకి ప్రవేశించి తలుపు తాతాలు పగలు గొట్టడంతో పాటు బీరువాను పెకిలించారు. గదిలోని వస్తువుల్ని చిందర వందరగా పడేశారు. రూ.50 వేలతోపాటు మూడు తులాల బంగారు ఆభరణాలు ఎత్తుకుపోయారు. బాధితురాలు గుర్తించి లబోదిబోమంటోంది. ఈ విషయమై పోలీసులు ఇంకా కేసు నమోదు చేయాల్సి ఉంది.


ఇంట్లో చిందర వందరగా వస్తువులు పడేసిన దృశ్యం

కంటైనర్ లారీని ఢీకొట్టిన కెమికల్ లారీ

- పులపర్తి వద్ద ప్రమాదంలో డ్రైవర్ మృతి



కంటైనర్ లారీను ఢీ కొట్టిన వ్యాన్, (ఇన్‌సెట్) ప్రమాదంలో మృతి చెందిన డ్రైవర్ బాషా

యలమంచిలి: హైవేపై ఆగిఉన్న కంటైనర్ లారీని రసాయనాల లోడుతో వెళ్తున్న లారీ వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. యలమంచిలి రూరల్ ఎస్సై కె.సన్నిబాబు వివరాల ప్రకారం... పరవాడ ఫార్మా పరిశ్రమ నుంచి రసాయనాల డ్రమ్ముల లోడుతో ఎన్టీఆర్ జిల్లా కంచకచర్ల మండలం మొగులూరు గ్రామానికి చెందిన షేక్ చాంద్ బాషా(47) తన లారీతో గుజరాత్ వెళ్తుండగా, గురువారం రాత్రి యలమంచిలి మండలం పులపర్తి హైవే జంక్షన్ వద్ద ఆగి ఉన్న కంటైనర్ లారీని వెనుక నుంచి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్ చాంద్ బాషా లారీ క్యాబిన్‌లో ఇరుక్కుపోయి తీవ్ర గాయాల పాలై ఘటన స్థలంలోనే ప్రాణాలు కోల్పోయాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

ద్విభాష్యంకు సతీ వియోగం


ద్విభాష్యం సీత(ఫైల్)

సీతంపేట: ప్రముఖ కథా రచయిత, విశాఖ సాహితీ సంస్థ గౌరవ అధ్యక్షుడు ద్విభాష్యం రాజేశ్వరరావు సతీమణి సీత అనారోగ్యంతో గురువారం రాత్రి కన్నుమూశారు. వీరికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. విశాఖ సాహితీ, విశాఖ రచయితల సంఘం, రైటర్స్ అకాడమీ సభ్యులు, పలువురు సాహితీవేత్తలు ఆమె మృతి పట్ల ప్రగాఢ సంతాపం తెలిపారు.

13 రోజ్‌వుడ్, గన్నర దుంగల పట్టివేత

గొలుగొండ: మండలంలోని కృష్ణదేవిపేటలో ఓ కార్పెంటర్ ఇంటి వద్ద అక్రమంగా దాచి ఉంచిన 13 రోజ్‌వుడ్, గన్నర దుంగలను కృష్ణదేవిపేట అటవీశాఖ సిబ్బంది పట్టుకున్నారు. గ్రామంలో ఆచారి ఇంటి వద్ద కలప ఉందని ఉన్నతాధికారులకు వచ్చిన సమాచారం మేరకు అటవీ సిబ్బంది శుక్రవారం రాత్రి దాడి చేసి స్వాధీనం చేసుకున్నారు. ఈ దుంగలను గొలుగొండ కలప డిపోకు తరలించారు. వీటి విలువ రూ.70 వేల వరకు ఉంటుందని అంచనా.

క్లుప్తంగా

అలరిస్తున్న ధ్యాన గణపతి



కశింకోటలోని కనకమహాలక్ష్మి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన విగ్రహం

కశింకోట: స్థానిక కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయం వద్ద నెలకొల్పిన ధ్యాన గణపతి విగ్రహం భక్తుల్ని విశేషంగా ఆకట్టుకుంటోంది. వినాయక నవరాత్రులు పురస్కరించుకుని ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేసి, నిత్యం పూజలు నిర్వహిస్తున్నారు. పెంటకోటవీధి కోటదిబ్బ వద్ద నెలకొల్పిన వినాయకుని మండపం ఆవరణలో శుక్రవారం పెద్ద ఎత్తున అన్న సమారాధన జరిపారు. ప్రజలు ఉత్సాహంగా కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదించాలని ధర్నా



ధర్నాలో పాల్గొన్న ఎమ్మార్పీఎస్ నేతలు

అనకాపల్లిటౌన్: పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదించాలని జిల్లా ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు కట్టుమూరి మంగరాజు డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు స్థానిక చోడవరం బస్టాప్ వద్ద శుక్రవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టి, ఎస్సీ ఏబీసీడీ వర్గీకరణ చేస్తామని చెప్పి నేటికీ అమలు చేయకపోవడం మాదిగలను మోసం చేయడమేనన్నారు. సంఘ కన్వీనర్ గౌటివాడ సామ్రాట్‌కుమార్ మాట్లాడుతూ ఎస్సీ కేటగిరీలోని 59 కులాలకు సామాజిక రాజకీయ, విద్య, వైద్య రంగాల్లో సమన్యాయం జరగాలంటే వర్గీకరణ జరిగి తీరాలన్నారు. కార్యక్రమంలో ఎంఎస్‌పీ పట్టణ కన్వీనర్ కొల్లి చిన్న అప్పారావు, ఎమ్మార్పీఎస్ జిల్లా యువ సేన అధ్యక్షుడు యలక మల్లిబాబు, నియోజకవర్గ ఎంఎస్‌పీ కో కన్వీనర్ చెవ్వేటి నాగరాజు, జిల్లా యువసేన నాయకుడు చెవ్వేటి కమల జగదీష్ పాల్గొన్నారు.

అనకాపల్లి సినిమాలు

వారెవ్వా జతగాళ్లు	: రాజా
మార్క్ ఆంటోని	: సత్యనారాయణస్క్రీన్-1
కలివీరుడు	: సత్యనారాయణస్క్రీన్-2
మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి	: షిర్డిసాయి
జవాన్	: పర్తిసాయి
జవాన్	: వెంకటేశ్వర
మిస్టర్ ప్రెగ్నెంట్	: శ్రీసత్య
ఎక్స్‌పెండబుల్స్4	: రామచంద్ర

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు శుక్రవారం 354 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,200	4,410
రెండో రకం	4,060	4,160
మూడోరకం	3,850	4,050

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్త నిధి కేంద్రంలో 62 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-10 యూనిట్లు, బీ పాజిటివ్-35 యూనిట్లు, బీ నెగిటివ్-1 యూనిట్, ఓ పాజిటివ్-15 యూనిట్లు, ఏబీ పాజిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి యు.లోకేష్(9703619706) నంబరును సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శుక్రవారం 352 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 247 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.

కొత్తగా.. మరింత మురి'పింఛన్'!

- అనకాపల్లి మండలంలో ఈ నెల 339 కొత్త పింఛన్లు
- అర్హతే ప్రామాణికంగా వైఎస్సార్ పింఛన్ కానుక

అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా సీఎం జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోంది. సంక్షేమ లబ్ధిలో జాప్యానికి తావులేకుండా చర్యలు తీసుకుంటోంది. పింఛన్ల పంపిణీలో గత ప్రభుత్వాలేవీ సాహసించలేని స్థాయిలో చేసిచూపిస్తోంది. వలంటీర్ల సాయంతో లబ్ధిదారుల ఇంటికి వెళ్లి మరీ ప్రతి నెలా ఒకటో తేదీనే పింఛన్లు అందిస్తోంది. ఎప్పటికప్పుడు కొత్త పింఛన్లు మంజూరు చేస్తూ ఆపన్నులకు అండగా నిలుస్తోంది.

అనాకాపల్లి రూరల్: రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పాలన ద్వారా ప్రజలకు అండగా నిలుస్తోంది. వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వచ్చాక కొత్త పింఛన్ కోసం గ్రామ సచివాలయంలో దరఖాస్తు చేసుకుంటే చాలు, వెంటనే మంజూరవుతోంది. అవ్వతాతలు, దివ్యాంగులు, వితంతువులకు అర్హత ఉంటే చాలు.. పార్టీలకు అతీతంగా పింఛన్ వచ్చేస్తోంది. ఎలాంటి ప్రలోభాలతో పనిలేదు. అర్హులైతే చాలు.. వలంటీర్లే ఇంటికి వచ్చి మరీ, అవసరమైన ధ్రువపత్రాలతో దరఖాస్తు చేయిస్తారు. మంజూరైన వెంటనే ఇంటికే వచ్చి పింఛన్ మొత్తం అందిస్తారు.

గతంలో కాళ్లరిగేలా తిరిగినా..

గత ప్రభుత్వంలో పింఛన్ కోసం మండల, జిల్లా కార్యాలయాలు, అధికారుల చుట్టూ చెప్పులు అరిగేలా తిరగాల్సి వచ్చేదని, ఎవర్ని అడిగినా చెప్పారు. అంతలా మొరపెట్టుకున్నా.. టీడీపీకి చెందిన జన్మభూమి కమిటీకి అనుకూలంగా ఉండే వారికి మాత్రమే పింఛన్లు వచ్చేవి. అవి కూడా లబ్ధిదారులెవరైనా మరణిస్తే వాటి స్థానంలో కొత్త వారికి మంజూరు చేసేవారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడి, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక స్పష్టమైన మార్పు వచ్చింది. సీఎం జగన్ ఇచ్చిన మాట ప్రకారం ప్రతి నెలా ఒకటో తేదీనే వలంటీర్ల ద్వారా వేకువజామునుంచే ఇంటి తలుపు తట్టి మరీ, చేతికి పింఛన్ సొమ్ము అందిస్తున్నారు. ప్రతి ఆరు నెలలకోసారి సచివాలయాల వారీగా వచ్చిన దరఖాస్తులను పరిశీలించి అర్హత ఉన్నవారందరికీ కొత్త పింఛన్లు మంజూరు చేస్తున్నారు. దీంతో అవ్వాతాతలు, దివ్యాంగులు, వితంతువులు ఇతరులపై ఆధారపడకుండా పింఛన్ సొమ్ముతో గౌరవంగా జీవిస్తున్నారు.

ఒక్క నెలలోనే 339 కొత్త పింఛన్లు

అనకాపల్లి మండలంలోని(పట్టణ పరిధి కాకుండా) 30 సచివాలయాల పరిధిలో కొత్తగా 339 పింఛన్లు మంజూరయ్యాయి. వారందరికీ ఈ నెల మొదటి వారంలోనే పింఛన్ల సొమ్మును పంపిణీ చేశారు. ఆయా గ్రామాల్లో సచివాలయాలు, గ్రామ పంచాయతీ కార్యలయాల వద్ద లబ్ధిదారులకు ప్రజా ప్రతినిధులు, అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకుల సమక్షంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమాలు కోలాహలంగా జరుగుతున్నాయి. అర్హత ఉన్న ఏ ఒక్కరూ పింఛన్ లబ్ధికి దూరం కారాదనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం అత్యంత పారదర్శకంగా వ్యవహరిస్తోంది. కులం, మతం, ప్రాంతం అనే బేధాలు లేకుండా లంచాలు, వివక్షకు తావులేకుండా అర్హులకు సంక్షేమ ఫలాలు అందిస్తోంది. ఏటా రెండు సార్లు జనవరి, ఆగస్టు నెలల్లో కొత్త పింఛన్లు మంజూరు చేస్తూ సామాజిక భద్రత పింఛన్ల కార్యక్రమం మరింత విస్తృతం చేస్తోంది.



కూద్రంలో కొత్త పింఛన్ అందిస్తున్న ఎంపీపీ గొర్లి సూరిబాబు



తుమ్మపాలలో వృద్ధురాలికి పింఛన్ అందిస్తున్న వలంటీర్

పెంచుకుంటూ వెళ్తున్నారు

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పింఛను సొమ్ము కేవలం నెలకు రూ.1000 మాత్రమే ఇచ్చేవారు. అది కూడా ఎన్నికలకు కాస్త ముందుగా పింఛన్ మొత్తాన్ని పెంచి, ప్రజల్ని మభ్యపెట్టేందుకు ప్రయత్నించారు. ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రతి ఏటా రూ.250 చొప్పున వైఎస్సార్ పింఛన్ కానుక మొత్తాన్ని పెంచుతూ వస్తోంది. ప్రస్తుతం ప్రతి లబ్ధిదారుకి రూ.2750 చొప్పున ఇంటికే వచ్చి పింఛన్ నగదు అందిస్తుండటంతో వృద్ధులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఎవరైనా ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నా, తప్పనిసరి పరిస్థితిలో వేరే చోట ఉన్నా వలంటీర్లు వారి వద్దకు వెళ్లి మరీ పింఛన్ అందిస్తూ, ప్రభుత్వ బాధ్యతను నెరవేరుస్తూ, తమ నిబద్ధత చాటుకుంటున్నారు.

జగనన్నకు రుణపడి ఉంటాం



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో అర్హత ఉంటే చాలు పింఛను మంజూరవుతోంది. గత ప్రభుత్వంలో కాళ్లరిగేలా తిరిగినా పింఛన్ వచ్చేదికాదు. ఈ ప్రభుత్వంలో అర్హులందరికీ పూర్తి న్యాయం జరుగుతోంది. సచివాలయాల ద్వారా సంక్షేమ పథకాలతో పాటు అన్ని రకాల సేవలు గ్రామ స్థాయిలోనే అందుతున్నాయి. జగనన్నకు రుణపడి ఉంటాం.

– భైశెట్టి బాలరాజు, తుమ్మపాల

సంతోషంగా ఉంది



నాకు వికలాంగుల పింఛన్ మంజూరైంది. ప్రతి నెలా రూ.3 వేలు ఇస్తారని అధికారులు చెప్పారు. ఈ నెల పింఛన్ సొమ్ము ఇప్పటికే అందించారు. నాకు కొత్తగా ఈ నెలే పింఛన్ మంజూరయింది. చాలా సంతోషంగా ఉంది. ఈ పింఛన్ నాకు ఎంతో ఆసరా. బతుకుపై ధీమానిచ్చింది. సంక్షేమానికి పెద్దపీట వేస్తున్న ఈ ప్రభుత్వానికే ఎప్పటికీ మా మద్దతు ఉంటుంది.

– పిల్లా నాగ సంతోష్ ఈశ్వరరావు, తుమ్మపాల

అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్



ప్రభుత్వ నియమ నిబంధనల మేరకు అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ పింఛన్ మంజూరు చేస్తున్నాం. వికలాంగులకు సదరం సర్టిఫికెట్ ఆధారంగా వెరిఫికేషన్ చేసి పింఛన్లు ఇచ్చాం. ఇంకా ఎవరైనా అర్హత కలిగిన వారుంటే వలంటీర్ల ద్వారా సచివాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చు. రాష్ట్ర ప్రభుత్వం పింఛనుదారులకు ప్రతి నెలా ఒకటో తేదీనే పింఛన్ సొమ్ము అందిస్తోంది.

– కె.వి.నరసింహారావు, ఎంపీడీవో

అభివృద్ధి పనులకు మంత్రి ప్రారంభోత్సవం నేడు

కశింకోట: కశింకోట పంచాయతీ పరిధిలో రూ.80 లక్షలతో నిర్మించిన పలు అభివృద్ధి పనులను శనివారం మధ్యాహ్నం 3.30 గంటలకు రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ప్రారంభించనున్నట్లు వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు శుక్రవారం తెలిపారు. రూ.25 లక్షలతో బాలుర స్కూలు నుంచి సతకంపట్టు రామాలయం వరకు, అక్కడి నుంచి కుమ్మరి వీధి వరకు నిర్మించిన సిమెంట్ రోడ్డు, డ్రైనేజీ, రూ.20 లక్షలతో గాడి వీధిలో సిమెంట్ రోడ్డు, మందబయల కమ్యూనిటీ హాలును ప్రారంభిస్తారన్నారు. రూ.25 లక్షలతో కనకమహాలక్ష్మి వీధి, రూ.10 లక్షలతో శిలపరశెట్టి వీధిలోను నిర్మించిన సిమెంట్ రోడ్డు, డ్రైన్లు, మరో రూ.10 లక్షలతో గవరపేట మధ్య వీధి నుంచి దుర్గమాంబ ఆలయం వరకు నిర్మించిన సిమెంట్ రోడ్డును మంత్రి చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేయించనున్నట్లు పేర్కొన్నారు. స్థానిక ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్ సీపీ శ్రేణులు, అభిమానులు, ప్రజలు హాజరై కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

నేత్రపర్వంగా గౌరీపరమేశ్వరుల ఊంజల్ సేవ



ఊంజల్ సేవలో పాల్గొన్న భక్తులు

అనకాపల్లిటౌన్: స్థానిక గౌరీ పంచాయతన దేవస్థానంలో గౌరీపరమేశ్వరుల 184వ ఊంజల్ సేవ శుక్రవారం నేత్రపర్వంగా జరిగింది. బుద్ధ మహాలక్ష్మి(అరవింద్), ఝాన్సీ దంపతులచే అర్చకులు అంపోలు గోపాలకృష్ణశర్మ, పొందూరు సూర్యనారాయణశాస్త్రి, శేషసాయి ఊంజల్ సేవ చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు బొడ్డేడ సన్యాసినాయుడు, కార్యదర్శి బుద్ధ రమణాజీ, కోశాధికారి కర్రి శివ సూర్యనారాయణ, పాలకవర్గ సభ్యులు, శ్రీ సత్తెమ్మతల్లి దేవస్థానం మహిళా మండలి, శ్రీ గౌరీ పరమేశ్వరి అమృత వర్షిణి బృంద సభ్యులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

అనకాపల్లిటౌన్: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని వినాయక చవితి సామూహిక నిమజ్జనోత్సవ కమిటీ చైర్మన్ ఆడారి కుమారస్వామి అన్నారు. స్థానిక భాష్యం స్కూల్‌తో పాటు, మరో 24 విద్యాసంస్థల్లో శుక్రవారం విద్యార్థులకు మట్టి గణపతి పూజించండి -పర్యావరణాన్ని పరిరక్షించండి అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోటీల్లో 25 స్కూళ్లకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరో 500 మంది విద్యార్థులకు పట్టణంలోని పలు స్కూళ్లలో శనివారం కూడా పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. నవరాత్రి వేడుకలు పూర్తయిన తర్వాత కమిటీ ఆధ్వర్యంలో బహుమతి ప్రధానోత్సవం ఉంటుందన్నారు.



వ్యాస రచన పోటీలకు హాజరైన విద్యార్థులు

పోటీలకు హాజరైన విద్యార్థులకు సర్టిఫికెట్‌తో పాటు ఒక బహుమతి కూడా అందిస్తామన్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు, టాప్ 20 మందికి కూడా బహుమతులందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో భాష్యం స్కూల్ ప్రిన్సిపాల్ పి.రమ, వైస్ ప్రిన్సిపాల్ ప్రసాద్, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్యం అందించండి

- తగరంపూడి పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సమావేశంలో ఎంపీపీ సూరిబాబు

అనకాపల్లి రూరల్: రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రజల వైద్యానికి అధిక ప్రాధాన్యతనిస్తోందని, ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా వైద్యులు, సిబ్బంది పనిచేయాలని ఎంపీపీ గొర్లి సూరిబాబు సూచించారు. మండలంలోని తగరంపూడి పీహెచ్‌సీలో శుక్రవారం జరిగిన ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆస్పత్రి సమస్యలపై అధికారులు, వైద్యులు, సిబ్బందితో చర్చించారు. రోగులకు మెరుగైన వైద్యం అందించేందుకు కమిటీ పలు అంశాలపై తీర్మానాలు చేసింది. ఆస్పత్రిలో చెదల నివారణ చర్యలు, బయో మెడికల్ వ్యర్థాలు నిల్వ ఉంచేందుకు అవసరమైన కవర్లు, గ్రీన్ క్లాత్ కొనుగోలు, దోమల నియంత్రణలో భాగంగా ఆస్పత్రి భవనం మొత్తం కిటికీలకు మెష్‌ల ఏర్పాటు, కంటింజెంట్ వర్కర్ల జీతభత్యాల చెల్లింపు, ల్యాబ్ కప్ బోర్డ్, గ్యాస్ సిలిండర్ ఏర్పాటు, కొత్త ఇన్వర్టర్ కొనుగోలు, అత్యవసరమైన విద్యుత్తు, ప్లంబింగ్ పనులు, ఎమెర్జెన్సీ లైటు కొనుగోలు కోసం సభ్యులు తీర్మానించారు. ముఖ్యంగా ఆస్పత్రి ఆవరణలో వర్షపు నీరు నిలిచి, రోగులు తీవ్ర ఇబ్బంది పడుతున్నటున్లు వైద్యులు, సిబ్బంది కమిటీ దృష్టికి తీసుకెళ్లారు. దీనికి సానుకూలంగా స్పందించిన ఎంపీపీ మండల పరిషత్ నిధులతో ఆస్పత్రి ఆవరణ అంతా గ్రావెల్‌తో చదును చేయడానికి తీర్మానించారు. అనంతరం ఆస్పత్రికొచ్చిన రోగులతో వైద్య సేవలపై ఆరా తీశారు. సమావేశంలో ఎంపీడీవో కేవీ నరసింహారావు, తహసీల్దార్ పీవీఎల్ఎస్ గంగాధరరావు, వైద్యాధికారులు జి.పావని, జి.రమ, తగరంపూడి సర్పంచ్ యాదగిరి అప్పారావు, దిబ్బపాలెం సర్పంచ్ పి.ఉష, ఫార్మసిస్ట్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ, కమిటీ సభ్యులు

ప్రభుత్వ భవనాలు త్వరితగతిన పూర్తి చేయాలి

అధికారులతో ట్రైనీ కలెక్టర్ స్మరణ్‌రాజ్

సబ్బవరం: మండలంలోని సచివాలయాలు,రైతు భరోసా కేంద్రాలు,వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లు వంటి ప్రభుత్వ భవనాలను త్వరితగతిన పూర్తి చేయాలని ట్రైనీ కలెక్టర్ స్మరణ్‌రాజ్ సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో ఆయన శాఖలవారీగా శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. జగనన్న కాలనీల నిర్మాణం, జగనన్న ఆరోగ్య సురక్ష అమలు తీరుపై ఆరా తీశారు. ఖరీఫ్‌లో వ్యవసాయ పంటలు, ఎరువుల పంపిణీ, తెగుళ్ల ఉధృతి నివారణకు చేపడుతున్న చర్యలు, స్త్రీ శిశు సంక్షేమ శాఖ ద్వారా అందుతున్న సేవలు, నాడు-నేడు స్కూల్ భవనాలు, మధ్యాహ్న భోజనం అమలు తీరుపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. పీహెచ్‌సీల ద్వారా అందుతున్న సేవలు, పశుసంవర్ధక శాఖలో అమలవుతున్న పథకాలపై ఆరా తీశారు. అదేవిధంగా సచివాలయాలకు వస్తున్న దరఖాస్తులన్నింటినీ క్షేత్రస్థాయిలో పరిశీలించి సకాలంలో పరిష్కరించాలన్నారు. వలంటీర్లు, సచివాలయ సిబ్బందితో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్షపై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన క్షేత్ర పరిశీలన చేసి నిర్మాణంలో ఉన్న పలు ప్రభుత్వ భవనాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీపీ బోకం సూర్యకుమారి, ఎంపీడీవో రమేష్ నాయుడు, తహసీల్దార్ సత్యనారాయణ, మండల జేసీఎస్ కన్వీనర్ సబ్బవరపు ముత్యాలనాయుడు, మండల వ్యవసాయ అధికారి పోతల సత్యనారాయణ, ఏవో ఎస్.బాబూరావు, ఎంఈవోలు లక్ష్మణరావు, బీవీఎస్ఎన్ మూర్తి, హౌసింగ్ ఏఈ శేఖర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హిమబిందు తదితరులు పాల్గొన్నారు.



మండల స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ట్రైనీ కలెక్టర్ స్మరణ్‌రాజ్

ఎరువుల కొరత లేకుండా ఏర్పాట్లు

ఎంపీపీ బోకం సూర్యకుమారి

సబ్బవరం: రైతు భరోసా కేంద్రాల్లో ఎరువుల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ బోకం సూర్యకుమారి వ్యవసాయ శాఖ సిబ్బందికి సూచించారు. మండలంలోని గుల్లేపల్లి రైతు భరోసా కేంద్రంలో 10 టన్నుల యూరియాను శుక్రవారం ఆమె చేతులమీదుగా రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరి పంటకు అవసరమైన యూరియా, పొటాష్ ఎరువుల కొరత లేకుండా చూసుకోవాలన్నారు. అదే విధంగా చీడపీడల నివారణకు రైతులకు అవసరమైన సూచనలు, సలహాలు అందించాలని గ్రామ వ్యవసాయ సహాయకులకు సూచించారు. అమృతపురం, సబ్బవరం, తవ్వవానిపాలెం, గొల్లలపాలెం అంతకాపల్లిలోని ఒక్కో రైతు భరోసా కేంద్రాలకు యూరియా చేరుతుందని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకురాలు హేమలత, రైతులు పాల్గొన్నారు.



రైతు భరోసా కేంద్రంలో రైతులకు ఎరువులు అందజేస్తున్న ఎంపీపీ బోకం సూర్యకుమారి

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు

మునగపాక: గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్టు జెడ్పీటీసీ సభ్యుడు పెంటకోట స్వామి సత్యనారాయణ తెలిపారు. మండల వ్యాప్తంగా రూ.9 లక్షలతో 8 తాగునీటి బోర్లకు జెడ్పీ నిధులు మంజూరయ్యాయి. ఈ మేరకు మునగపాక జగనన్న లే-అవుట్‌లో జరుగుతున్న బోరు పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు సహకారంతో మునగపాక మండల అభివృద్ధికి కృషి చేస్తున్నట్టు చెప్పారు. ఎక్కడైనా తాగునీటి సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు.



బోరు పనులను పరిశీలిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు

సామూహిక సెలవుకు వినతి

కశింకోట: సమగ్ర శిక్ష ఒప్పంద, పొరుగు సేవల ఉద్యోగుల ఫెడరేషన్ పిలుపు మేరకు తమ కోర్కెల సాధనకు ఈ నెల 25న సామూహిక సెలవు తీసుకుని, సత్యాగ్రహం నిర్వహించనున్న దృష్ట్యా తమకు సెలవు మంజూరు చేయాలని కోరారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక మండల విద్యాశాఖ కార్యాలయంలో ఎంఈవో మూర్తికి ఫెడరేషన్ మండల కమిటీ తరపున ఉద్యోగులు వినతి పత్రాన్ని అందించారు. సమగ్ర శిక్ష సొసైటీలో పని చేస్తున్న ఉద్యోగులను రెగ్యులర్ చేసి ఉద్యోగ భద్రత, ఇతర సదుపాయాలు కల్పించాలని వినతి పత్రంలో కోరారు. కార్యక్రమంలో ఫెడరేషన్ ప్రతినిధులు, ఒప్పంద, పొరుగు సేవల ఉద్యోగులు డి.లక్ష్మణ, ఎం.వసంత రవి కుమారి, బి.వి.రమణమ్మ, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు డీవీఎన్ కళాశాలలో ఉద్యోగ మేళా

అనకాపల్లిటౌన్: నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు స్థానిక దాడి వీరునాయుడు కళాశాలలో శనివారం ఉదయం 9 గంటలకు ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కోరిబిల్లి రమేష్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళాకు దేశంలో వివిధ ప్రాంతాలకు చెందిన 10 మల్టీ నేషనల్ కంపెనీ(ఎంఎన్‌సీ)ల ప్రతినిధులు పాల్గొని, తమకు అవసరమైన మేరకు, అర్హులైన అభ్యర్థులను ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక చేస్తారని పేర్కొన్నారు. ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులైన నిరుద్యోగ అభ్యర్థులు ఈ ఉద్యోగ మేళాకు హాజరు కావచ్చన్నారు. ఇంటర్వ్యూకు వచ్చే అభ్యర్థులు తమ బయోడేటా, ఆధార్ కార్డు, సంబంధిత ధ్రువపత్రాలను తప్పని సరిగా వెంట తీసుకురావాలన్నారు. నిరుద్యోగ అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాల్సిందిగా కోరారు.

జిల్లా స్థాయి క్రీడా పోటీలకు విద్యార్థులు



జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన హైస్కూల్ విద్యార్థులు

కశింకోట: స్థానిక బాలికల హైస్కూల్లో ఉమ్మడి జిల్లా స్థాయి ఖోఖో, యోగా ఎంపిక పోటీలు శుక్రవారం నిర్వహించారు. ప్రతిభ కనబరచిన 8 మందిని వివిధ జట్లకు ఎంపిక చేశారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలను అండర్-14, 17 కేటగిరీలో బాల, బాలికలకు వేర్వేరుగా నిర్వహించారు. ఖోఖోలో ఎంపికైన విద్యార్థులు ఈ నెల 25న లంకెలపాలెంలో జరిగే ఉమ్మడి జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని పీడీ పెంటకోట కమల తెలిపారు. యోగా పోటీలకు ఇంకా తేదీ ఖరారు కాలేదన్నారు. ఈ పోటీలను ఎంఈవో మూర్తి, హెచ్‌ఎం ఎం.ఎస్.స్వర్ణకుమారి పర్యవేక్షించారు. పీడీలు వి.ప్రభాకరరావు, పీలా వీరునాయుడు, కె.వీరునాయుడు, కె.ఎం.నాయుడు, రాజు తదితరులు పోటీలు నిర్వహించి, జట్లను ఎంపిక చేశారు.



యోగా పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు


డ్వాక్రా సంఘాల బలోపేతానికి కృషి

మునగపాక: డ్వాక్రా సంఘాల బలోపేతానికి కృషి చేయాలని డీఆర్‌డీఏ పీడీ లక్ష్మీపతి ఆదేశించారు. స్థానిక వెలుగు కార్యాలయంలో శుక్రవారం వీవోఏలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీవోఏలు బాధ్యతగా పనిచేసి సంఘాలను బలోపేతం చేయాలన్నారు. సంఘాల లావాదేవీలపై దృష్టి సారించాలని తెలిపారు. సంఘాల ద్వారా తీసుకున్న రుణాలు సద్వినియోగమయ్యేలా చూడాలన్నారు. అనంతరం విత్తనాలు పంపిణీ చేశారు. ఏరియా కో-ఆర్డినేటర్ ధర్మారావు,ఏపీఎం కొండమ్మ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ లక్ష్మీపతి

5న ఢిల్లీలో బహిరంగ సభ



కరపత్రాలు ప్రదర్శిస్తున్న ఐద్వా కార్యకర్తలు

పరవాడ: మద్యం, మత్తు పదార్థాలను నియంత్రించాలని కోరుతూ అక్టోబరు 5న ఢిల్లీలో నిర్వహించనున్న బహిరంగ సభను జయప్రదం చేయాలని ఐద్వా అనకాపల్లి జిల్లా అధ్యక్షురాలు పి.మాణిక్యం కోరారు. ఢిల్లీ బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరుతూ ఐద్వా ఆధ్వర్యంలో శుక్రవారం పరవాడలో కరపత్రాలతో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మాణిక్యం మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 76 ఏళ్లు పూర్తి కావస్తున్నప్పటికీ మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. మహిళలు, చిన్నారులపై అనేక రకాల అత్యాచారాలు జరుగుతూనే ఉన్నాయన్నారు. అన్ని రంగాల్లో మహిళలు ముందడుగు వేస్తున్నప్పటికీ సమానత్వం కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మణిపూర్ సంఘటనలో బాధ్యులపై చర్యలు తీసుకోవడంలో బీజేపీ ప్రభుత్వం విఫలమైందని మాణిక్యం ఆరోపించారు. కార్యక్రమంలో శ్రీదేవి, రమణమ్మ, వరలక్ష్మి, వరహాలమ్మ, ఈశ్వరమ్మ, పద్మ, చిన్నమ్మలు పాల్గొన్నారు.